## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి ఎంపీపీ విరాళం



వానపల్లిపాలెం గ్రామ పెద్దలకు విరాళం అందిస్తున్న పార్టీ నాయకులు

**ఉప్పలగుప్తం:** మండలంలోని వానపల్లిపాలెం గ్రామ పంచాయతీ పరిధి బొర్రాయిపాలెంలో నిర్మాణంలో ఉన్న సీతారామ ఆలయానికి ఎంపీపీ దంగేటి వీర అచ్యుతజానకి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు దంపతులు రూ.25 వేలు విరాళంగా సమకూర్చారు. స్థానిక గ్రామంలో మండల పార్టీ నాయకుల చేతుల మీదుగా నగదును సోమవారం గ్రామ పెద్దలకు అందజేశారు. సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, పార్టీ నాయకులు నల్లా నాయుడు, సలాది సతీష్, నల్లా సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

### ఆలయ అభివృద్ధికి రూ.10,116 సమర్పణ

**అమలాపురం టౌన్:** స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అమలాపురం రూరల్ మండలం నడిపూడి గ్రామానికి చెందిన అరిగెల వెంటక సుబ్బారావు రూ.10,116 విరాళం సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతదేవి, ఈవో దూనబోయిన సాయిబాబుకు ఆలయంలో సోమవారం అందించారు. స్వామి ఆలయంలో ఏడు శనివారాలు, 27 నక్షత్రాల ప్రదర్శనల మొక్కు తీర్చుకున్నాక తాను స్వామికి విరాళం అందించినట్లు సుబ్బారావు తెలిపారు.

### 29 నుంచి శ్రీకోదండ రామనవమి ఉత్సవాలు

**యానాం:** యానాం నియోజకవర్గ పరిధిలోని కనకాలపేట గ్రామంలో కొలువైన శ్రీకోదండరామస్వామి వారి దేవాలయంలో ఈ నెల 29నుంచి ఏప్రిల్ 2వరకు 76వ శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సోమవారం శ్రీరామ, పోలేరమ్మ ఉత్సవ కమిటీ, దేవస్థానం కమిటీలు ప్రకటనలో తెలిపాయి. ఈ నెల 29న మూలవిరాట్‌కు అభిషేకం, అగ్ని ప్రతిష్ఠాపన, 30న స్వామివారి కల్యాణం, గ్రామోత్సవం, 31న నిత్య హోమం, ఏప్రిల్ 1న ఏకాహం, 2న చక్రస్నానం, పూర్ణాహుతి కార్యక్రమాలుంటాయన్నారు.

### ఘనంగా సీతారామ పరివారల విగ్రహ ప్రతిష్ఠ



నూతన ఆలయంలో కొలువుదీరిన సీతా సమేత శ్రీ రామచంద్రమూర్తి పరివార దేవతలు

**తాళ్లరేవు:** మండల పరిధిలోని కోరంగి పంచాయతీలో నూతనంగా నిర్మించిన సీతారామ పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కొత్త కోరంగి రైతు భరోసా కేంద్రం సమీపాన నిర్మించిన ఈ ఆలయంలో సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మణ, భరత, శతృఘ్న, ఆంజనేయ స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### భవిత విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

**ముమ్మిడివరం:** స్థానిక భవిత స్కూల్లో ప్రత్యేక అవసరాల పిల్లలు 27 మందికి రాజుపాలేనికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు పితాని సత్యనారాయణమూర్తి ఆర్థిక సాయంతో నోట్ బుక్స్, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు, స్వీట్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఐఈఆర్‌సీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు భూమిపూజ

**ముమ్మిడివరం:** మండలంలో అయినాపురం బాడవ శ్మశాన వాటికలో రూ.4 లక్షలు మండల పరిషత్ నిధులతో నిర్మించే విశ్రాంతి భవనానికి సోమవారం ఎంపీపీ కోలా గంగాభవానీ భూమి చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకర రావు, వైస్ ఎంపీపీలు మట్టపర్తి సురేష్, పాము నాగవేణి, పెయ్యల చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

### చెత్త నుంచి సంపద సృష్టిపై శిక్షణ

**అల్లవరం:** జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి సంపదను ఎలా సృష్టించుకోవాలి, గ్రామాలను ఏ విధంగా క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచుకోవాలో కొమరగిరిపట్నం గ్రామ సచివాలయంలోని ఏర్పాటు చేసిన లోకల్ ట్రెనింగ్ కేంద్రంలో నాలుగో రోజు శిక్షణ ఇచ్చారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో సఖినేటిపల్లి, రాజోలు మండలాల నుంచి రామేశ్వరం, చింతపల్లి, వీపీ మెరక, కూనవరం గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులకు సాలిడ్ వేస్టు ప్రోసెసింగ్‌పై ట్రెనింగ్ కోఆర్డినేటర్ మధు మహేష్, ఎంపీడీఓ జే.సరోవర్ అవగాహన కల్పించారు. సఖినేటిపల్లి ఎంపీడీఓ భీమారావు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, కార్యదర్శి ఎన్‌వీవీ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మానాన్నలకు ఆలయం

## నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబం



కోరంగి పంచాయతీ సుబ్బారాయుని దిమ్మ వద్ద తల్లిదండ్రులకు నిర్మించిన ఆలయం



బొడ్డు భైరవస్వామి, నాగమాంబ దంపతులకు పూజలు చేస్తున్న కుటుంబ సభ్యులు

**తాళ్లరేవు:** కనీ పెంచిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో వదిలిపెడుతున్న నేటి రోజులలో వారి జ్ఞాపకార్థం ఆలయం నిర్మించారు ఆ సోదరులు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బొడ్డు కృష్ణమూర్తి, ప్రముఖ వ్యాపార వేత్త బొడ్డు సత్యనారాయణ తమ తల్లిదండ్రులైన బొడ్డు భైరవస్వామి, నాగమాంబ దంపతులకు ఆలయం నిర్మించారు. జాతీయ రహదారి 216 చెంతన సుబ్బారాయుని దిమ్మ వద్ద అత్యంత విలువైన స్థలంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఆలయం నిర్మిస్తున్నారు. వచ్చే నెల ఒకటో తేదీన అట్టహాసంగా విగ్రహ ప్రతిష్ఠలు చేసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. సోమవారం మంచిరోజు కావడంతో ఆయా విగ్రహాలకు బొడ్డు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డు సోదరులు విలేకర్లతో మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అనే సంప్రదాయాన్ని మాకు నేర్పి ఎంతో ఉన్నతంగా పెంచారని, వారి రుణం తీర్చుకోవడం కోసం ఆలయం నిర్మించి వారిని గౌరవించుకుంటున్నట్లు తెలిపారు. కష్టపడి పెంచిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో పెడుతున్న ఈ రోజుల్లో తాము పలువురికి ఆదర్శంగా ఉండాలనే లక్ష్యంతో ఈ ఆలయం నిర్మించినట్లు తెలిపారు. ఈ ఆలయం చూసి భవిష్యత్ తరాల వారు తల్లిదండ్రుల పట్ల భక్తి భావం కలిగి, వారి అంత్యకాలంలో బాగా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డు భైరవస్వామి కుమార్తెలు కె.వెంకాయమ్మ, పెమ్మాడి రాఘవ, కాలాడి కూర్మావతి, కామాడి ధనలక్ష్మి పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

## కౌన్సిల్‌లో చైర్మన్ ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్

**ముమ్మిడివరం:** కుల,మత, రాజకీయాలకతీతంగా అర్హులైన అందరికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందిస్తూ ముమ్మిడివరం నగర పంచాయతీని ప్రగతి పథంలోకి తీసుకు వెళ్తున్నామని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. అజెండాలో పొందుపర్చిన 13 అంశాలపై సమావేశంలో చర్చిస్తుండగా ప్రతి పక్ష టీడీపీ సభ్యుడు అడబాల సతీష్‌కుమార్ మాట్లాడుతూ కౌన్సిలర్‌గా ఎన్నికై రెండేళ్లు పూర్తయింది. ఇప్పటి వరకు 24 కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. అయినప్పటికి వార్డులలో అభివృద్ధి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉందని అన్నారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ నగర పంచాయతీలో ఇప్పటివరకు రూ.32 కోట్లతో ప్రజా సంక్షేమ పథకాలు అందించామన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్న ఏకైక ప్రభుత్వం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదని, ఆయన ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధిగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని ఉద్ఘాటించారు. నగర పంచాయతీలో అన్ని వార్డులలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.10కోట్లతో ప్రతిపాదనలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నివేదించామని నిధులు మంజూరు కాగానే మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. 13వవార్డు బొండాయి కోడు సమీపంలో పైపులైన్ లీకై వారం రోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదని.. తాత్కాలికంగా పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీరందించకపోతే వేసవిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుందని ఆ వార్డు కౌన్సిలర్ కోటుం జయలక్ష్మి కౌన్సిల్ దృష్టికి తీసుకు వచ్చారు. పైపులైన్ లీక్‌లను అరికట్టి తాగు నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని చైర్మన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. కౌన్సిల్‌లో అన్ని వార్డుల ప్రజలకు సమన్యాయం చేస్తున్నా లేనిపోని ఆరోపణలు గుప్పిస్తున్న ప్రతిపక్ష సభ్యులు ఐదవ కౌన్సిల్‌కు హాజరుకాకపోవడంలో ఆంతర్యమేమిటని 17 వార్డు కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ ప్రశ్నించారు. వివిధ పనులకు సంబంధించి ఒకటో పద్దుగా రూ.7,64,772 జమలు గాను, రూ.6,64,851 ఖర్చుగాను, రెండో పద్దు నుంచి రూ.9.01,484 జమలుగాను, రూ.15,98,988 ఖర్చుగాను ప్రవేశ పెట్టిన బిల్లులను సమావేశం ఆమోదించింది. కమిషనర్ జి.లోవరాజు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పీడబ్ల్యూడీలో అవకతవకలపై విచారణ

## అసెంబ్లీలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్



పుదుచ్చేరి అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్అశోక్

**యానాం:** పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ)లో జరుగుతున్న అవకతవకలపై విచారణ నిర్వహించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పుదుచ్చేరి అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. యానాం నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులను పీడబ్ల్యూడీ అధికారులు అడ్డుకుంటున్నారని అభివృద్ధి నిరోధకులుగా తయారయ్యారని అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన కోట్లాది రూపాయలను ఖర్చు చేయకుండా వాటిని తిరిగి వెనుకకు మళ్లించడంలో వారు ఆంతర్యమేమిటని పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణను ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గ పరిధిలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, వీటి నిర్మాణాలకు తక్షణం నిధులు మంజూరుచేయాలని కోరారు. మంత్రి లక్ష్మీనారాయణ సమాధానమిస్తూ యానాంకు సంబంధించి 50కి పైగా వివిధ పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# ఆకట్టుకున్న లేగ దూడల ప్రదర్శన



ఆకట్టుకున్న పుంగనూరు లేగదూడ



ప్రథమ బహుమతిని అందజేస్తున్న ఎంపీపీ సునీత తదితరులు

**తాళ్లరేవు:** జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా పోలేకుర్రులో సోమవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేశీయ ఆవులైన ఒంగోలు, గిర్, సహివాల్‌తోపాటు విదేశీ జాతి పశువులైన జెర్సీ, హెచ్ఎఫ్ తదితర పశువుల దూడలను రైతులు ప్రదర్శించారు. ఎంపీపీ రాయుడు సునీత మాట్లాడుతూ పశు సేవలకు 1962 నంబరుతో వాహనాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.బ్రహ్మవేద మాట్లాడుతూ లేగ దూడలను పుట్టినప్పటి నుంచి సంరక్షించాలని, పుట్టిన ఏడవ రోజు, 14, 28వ రోజుతోపాటు ప్రతీ ఆరు నెలలకు పాముల మందు వేయాలన్నారు. 38 దూడలను ప్రదర్శించగా పుంగనూరు దూడ రైతు పంపన బుజ్జి ప్రథమ బహుమతి, జెర్సీ దూడ రైతు వలవల గోవింద ద్వితీయ, ముర్రా జాతి దూడ రైతు త్రిమూర్తులు తృతీయ బహుమతికి ఎంపికయ్యారు. వీరికి ఎంపీపీ సునీత బహుమతి ప్రదానం చేశారు. వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు దున్నా జనార్ధనరావు, కుడుపూడి శివన్నారాయణ, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, రాయుడు గంగాధర్, పశు సంవర్ధక శాఖ డీడీ అంబేడ్కర్, వెటర్నరీ వైద్యులు భవానీ, దవులూరి సుధ, ఎం.వెంకటరమణ, శుభశ్రీ, సుధీర్, ప్రియాంక పాల్గొన్నారు.

# నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యుల నిరసన



కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందిస్తున్న ఐఎంఏ అమలాపురం శాఖ వైద్యులు

**అమలాపురం టౌన్:** ప్రైవేటు వైద్యులతో ఏ మాత్రం చర్చించకుండా ఇటీవల రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరోగ్య హక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అమలాపురం శాఖ సోమవారం నిరసన వ్యక్తం చేసింది. పట్టణానికి చెందిన వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఈ నిరసనలో పాల్గొన్నారు. వైద్యుల హక్కులను కూడా పరిగణనలోకి తీసుకుని తమతో చర్చించి సమగ్రమైన చట్టాన్ని తెచ్చే వరకూ ఆరోగ్య హక్కు చట్టాన్ని నిలిపివేయాలని ఐఎంఏ అమలాపురం శాఖ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి డాక్టర్ కడలి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఐఎంఏ పిలుపు మేరకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ తమ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తూనే నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం వినతి పత్రాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందజేశారు. ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ జి.ప్రభాకర్, డాక్టర్ పయ్యావులు సురేష్‌బాబు పాల్గొన్నారు.

# డీటీహెచ్ టెక్నీషియన్స్ యూనియన్ ఆవిర్భావం



సమావేశంలో మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు తాతాజీ

**అమలాపురం టౌన్:** టీవీ డిష్‌లు ఏర్పాటుచేసే (డైరెక్ట్ టూ హోమ్) డీటీహెచ్ టెక్నీషియన్లు స్థానిక కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ఆలయ ఆవరణలో సోమవారం సమావేశమై నూతన యూనియన్‌ను కొత్తగా ఏర్పాటు చేసుకున్నారు. కోనసీమ వ్యాప్తంగా ఉన్న 90 మంది టెక్నీషియన్లు ఈ సమావేశంలో పాల్గొని ది కోనసీమ ఆల్ డీటీహెచ్ టెక్నీషియన్ల యూనియన్‌ను ఏర్పాటు చేసుకుని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా డీవీవీ శ్రీనివాసరావు, గౌరవ కార్యదర్శిగా నీరుపూడి సూర్యనారాయణమూర్తి, అధ్యక్షుడిగా వాసంశెట్టి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా పాలగుమ్మి సురేష్, అంగాని ఏడుకొండలు, కార్యదర్శిగా కాండ్రేగుల రాజు, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ వీర వెంకట దుర్గా మల్లేశ్వరరావు, కోశాధికారిగా అయినవిల్లి నాగ వెంకట శ్రీనివాస్, సంయుక్త కోశాధికారిగా మట్ట వీరేంద్ర, ముఖ్య సలహాదారుగా ఓగూరి రాజబాబును సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

# ముంపు సమస్యపై స్పందనలో అర్జీ

**అల్లవరం:** తమ గ్రామ సచివాలయం పరిధిలోని పల్లపు ప్రాంతాలు ఏటా వర్షాకాలంలో వర్షాలు, వరదల కారణంగా ముంపు బారిన పడుతున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ అల్లవరం గ్రామస్తులు కలెక్టర్‌కు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. గుడ్డివానిచింత వద్ద పిల్లా పట్టాభిరామారావు కాఫీ హోటల్ వెనుక వైపున, కుమ్మరికాలువ మీద ఉన్న కాలిబాట వంతెన పక్కన ఉన్న తూరల నుంచి వరద నీరు ఎదురెక్కి పల్లపు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని ఫిర్యాదు పేర్కొన్నారు. వరద నీరు ఎదురెక్కకుండా స్లూయిజ్‌లు నిర్మించాలని బొక్కా శ్రీను, దాసం శ్రీరామచంద్రమూర్తి, కేవీవీ రావు, ఎంపీ లక్ష్మీ కలెక్టర్‌ను కోరారు.

# ఎలక్టోరల్ రోల్‌కు ఆధార్‌లింక్ ప్రక్రియ

**యానాం:** పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ ప్రాంతాల్లోని మున్సిపాలిటీలకు 2011 నుంచి 11 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఈ ఖాళీ సమయంలో ఓటర్ల జాబితాకు ఆధార్ లింక్ ప్రక్రియను వేగవంతం చేసినట్లు సోమవారం అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 2021లో స్థానిక సంస్థల ఎన్నికలకు పుదుచ్చేరి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే వార్డుల రిజర్వేషన్ల కేటాయింపు సరిగా లేదంటూ కొంతమంది మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఇటీవలి నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ ఉపసంహరించుకుంది. కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వడానికి సమాయత్తమవుతోంది. దీంతో వార్డుల్లో బీసీలకు, ట్రైబల్స్ కోటాకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. బీసీల కోటాపై మద్రాసు హైకోర్టును ఆశ్రయించిన ప్రతిపక్ష నేత శివ తన కేసును ఉపసంహరించుకుని కోర్టు సూచన మేరకు సుప్రీంకోర్టుకు వెళ్లారు. అయితే కోర్టు తీర్పు వచ్చేలోగా ఓటర్ల జాబితాను తయారు చేయడం, వాటికి ఆధార్‌లింక్ చేసే ప్రక్రియను చేస్తున్నారు. జనవరిలో వెలువరించిన ఓటర్ల జాబితా ప్రకారం ఇప్పటికే వార్డులవారీ విభజించారు. ఓటరు జాబితాకు ఆధార్‌లింక్ కోసం ఇంటింటికి సిబ్బంది తిరిగారు. మొత్తం 10,02,595 మంది ఓటర్లుకుగాను 74.61శాతం మంది దీనికి సహకరించారన్నారు.

# జీవకోటికి జలమే ఆధారం




ర్యాలీ నిర్వహిస్తున్న గిరియాంపేట విద్యార్థులు

**యానాం:** జలమే జీవనాధారమని, నీరు లేనిదే సమస్త జీవకోటికి మనుగడ లేదని రాష్ట్ర జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నేత కేవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు దంగేటి త్రిమూర్తులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న 97శాతం నీరు మానవ ఉపయోగానికి పనికిరాదని, రెండుశాతం మంచురూపంలో ఉందని మిగిలిన ఒకశాతం మాత్రమే మానవులకు పనికివస్తుందని దానిని పొదుపుగా వాడుకోవాలన్నారు. అంతకముందు నీటిని పొదుపుచేయండి, నీటిని వృథా చేయవద్దు అని రాసి ఉన్న ప్లకార్డులతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

### పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

**యానాం:** కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో ఈ నెల 3 నుంచి 18 వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్, మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్, కనకాలపేట ఎస్‌కేపీవీఎన్ ప్రభుత్వ హైస్కూల్ కేటాయించారన్నారు. ఈ కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరిగే పరీక్షలకు యానాంకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 576 మంది, తాళ్లరేవు మండల విద్యార్థులు 114 మంది రాయనున్నారని తెలిపారు. ఇందుకోసం 33 మంది ఇన్విజిలేటర్లను, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ ఆఫసర్లను, ముగ్గురు చీఫ్ సూపరిండెంట్‌లను నియమించారన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్‌సెంటర్‌లను మూసివేయాలని ఆదేశించినట్లు చెప్పారు.

### బాలల సంరక్షణకు భాగస్వాములు కావాలి

**యానాం:** హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధిత బాలలను గుర్తించి వారిని సమాజంలో భాగస్వామ్యం చేయాల్సిన ఆవశ్యకత ఉందని, వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించాలని చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో యానాంలో హెచ్ఐవీ ప్రాజెక్టును నిర్వహిస్తున్న వైజ్ సీబీఓ ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత బాలలకు కావాల్సిన మౌలిక సౌకర్యాల గురించి వివరించారు. అనంతరం వైజ్ ప్రాజెక్టు ప్రతినిధి పీఎం కరుణాకర్ మాట్లాడుతూ వైజ్ సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. చైల్డ్ లైన్ సిబ్బంది కె.శ్రీదేవి, నూకరత్నం, గీత, విజయలక్ష్మి, వైజ్ ప్రతినిధులు శాంతకుమారి, మంగాదేవి, రేవతి, రాజేష్, గాయత్రి, కామేశ్వరి పాల్గొన్నారు.

### వైఎస్సార్ ఆసరా సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**తాళ్లరేవు:** కోరంగి గ్రామంలో వచ్చే నెల 1వ తేదీన నిర్వహించే వైస్సార్ ఆసరా బహిరంగ సభా ప్రాంగణాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక ఏర్పాటుపై అధికారులు, నాయకులకు పలు సూచనలు ఇచ్చారు. ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిందిగా కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రాయుడు సునీత, తాళ్లరేవు, కాట్రేనికోన జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, నేల కిషోర్, గ్రామ సర్పంచ్ పెయ్యల మంగేష్, పార్టీ రాష్ట్ర నాయకులు దున్నా జనార్దనరావు, కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ ఉన్నారు.

### మున్సిపల్ కమిషనర్‌గా గోయల్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన గోయల్

**యానాం:** స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా పుదుచ్చేరి సివిల్ సర్వీసెస్(పీసీఎస్) స్థాయి అధికారి ద్విజ్‌గోయల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మున్సిపల్ ఉద్యోగులు, వివిధ విభాగాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని సావిత్రినగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, పరంపేట, మెట్టకూరు తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీరు మేడిశెట్టి రాము, మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నిరసన

**ముమ్మిడివరం:** రాహుల్‌గాంధీని అక్రమ కేసుల్లో ఇరికించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. జైబుద్ధ పార్కులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడ నుంచి పాదయాత్రగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన చేపట్టారు. పార్లమెంట్‌లో బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ప్రశ్నిస్తున్న రాహుల్‌గాంధీ గొంతు నొక్కి వేయాలని బీజేపీ ప్రభుత్వం ఈ కుట్ర పన్నిందన్నారు. వడ్డి నాగేశ్వరరావు, ముషిణి రామకృష్ణారావు, దోనిపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

### రొయ్యల చెరువులో పురుగుల మందు కలిపిన దుండగులు

**ఐ.పోలవరం:** రొయ్యల చెరువులో గుర్తుతెలియని వ్యక్తులు పురుగు మందు కలిపిన ఘటన మండలంలో చోటు చేసుకొంది. మురమళ్ల గ్రామంలో వాశంశెట్టి రమేష్ ఒక ఎకరం రొయ్యల చెరువును లీజుకు తీసుకొని అందులో రొయ్య పిల్లలను 30రోజుల క్రితం వేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం పురుగు మందు కలపడంతో చెరువులో ఉన్న రొయ్యలు తేలుతూ ఉండటాన్ని ఉదయాన్నే రమేష్ గుర్తించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రాజేష్ సిబ్బందితో కలసి చెరువును, చుట్టుపక్కల ప్రదేశాన్ని పరిశీలించి కొన్ని ఆధారాలు సేకరించారు. పురుగు మందు కలపడం వలన సుమారు రూ.మూడు లక్షల నష్టం జరిగిందని రైతు రమేష్ ఆవేదన చెందుతున్నాడు.

### మృతదేహం గుర్తింపు

**ఐ.పోలవరం:** పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం మురమళ్ల -కేశనకుర్రు ప్రధాన పంటకాలువలో ఆదివారం లభ్యమైన మహిళ మృతదేహం మురమళ్ల గ్రామానికి చెందిన సాగి వెంకటరమణమ్మ(60)దిగా స్థానికుల సహకారంతో పోలీసులు గుర్తించారు. ఆమె బంధువులకు సమాచారం అందజేసి మృతదేహాన్ని అందజేశారు.

### జూదరుల అరెస్టు

**ముమ్మిడివరం:** మండలంలోని సీహెచ్ గున్నేపల్లిలో బొమ్మా బొరుసు ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.6వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీహెచ్ గున్నేపల్లి శివారు నల్లావారిపేటలో ఎస్సై కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో దాడి చేశారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.